సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 6 । మే । 2025



కొనసాగుతున్న నిరసన

సమస్యల పరిష్కారం కోసం విలేజ్ క్లినిక్‌ల సీహెచ్‌ఓలు చేపట్టిన నిరసన కార్యక్రమం **కొనసాగుతోంది. ఎనిమిది రోజులుగా వారు సమ్మెలో ఉన్నారు.** 8లో ▸



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వేళాయె

ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 8లో ▸



మల్లఖాంబ్ పోటీలకు ఎంపిక

శాప్ నిర్వహిస్తున్న 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మల్లఖాంబ్ పోటీలకు భీమవరానికి చెందిన 9 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. 8లో ▸

సర్కారు నిండా ముంచేను

ఆలమూరులో 807 ఎకరాల ఆయకట్టుకు దాళ్వా ధాన్యం అంచనా దిగుబడి సుమారు 3,147 టన్నులు. రైతులు ఓపెన్ మార్కెట్ నిమిత్తం 15 శాతం (472 టన్నులు) మినహాయించగా దాదాపు 2,674 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. అయితే 2,196 టన్నుల ధాన్యం మాత్రమే లక్ష్యంగా నిర్ణయించారు. సోమవారం నాటికి 1,934.76 టన్నులు సేకరించగా మరో 262 టన్నులు మిగిలి ఉంది. వారం క్రితమే ధాన్యం కోసి ఆరబెట్టామని, సకాలంలో సంచులు అందక మిల్లుకు తరలించలేకపోయామని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు.

ధాన్యం.. వర్షార్పణం

- పట్టుబడులకు సంచుల కొరత
- ఆర్‌ఎస్‌కేల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- వారం క్రితం ధాన్యం ఆరబెట్టినా సంచుల్లేక ఇబ్బందులు
- అకాల వర్షానికి తడిసిన ధాన్యం
- మరలా ఆరబెట్టాల్సి వస్తోందని ఆవేదన



మార్టేరు రోడ్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

సాక్షి, భీమవరం: జిల్లాలోని 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేయగా 9.25 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీనిలో రైతులు ఓపెన్ మార్కెట్‌లో విక్రయాలు, నిల్వ నిమిత్తం 1.50 లక్షల టన్నులు మినహాయించగా.. 7.75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే 6 లక్షల టన్నుల సేకరణకు ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 4.8 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్టు అధికార వర్గాలు అంటున్నాయి. లక్ష్యానికి మించి మరో 1.5 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వాన్ని కోరినట్టు చెబుతున్నాయి.

రైతులను ముంచిన సంచుల కొరత

జిల్లాకు 1.49 లక్షల గోనె సంచులను సిద్ధం చేయగా ఇప్పటికే 1.12 లక్షల సంచులను వినియోగించినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 37 లక్షల సంచులు ఆర్‌ఎస్‌కేల్లో ఉన్నాయని, సంచులకు కొరత లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే సంచులకు కొరత ఉందని రైతులు వాపోతున్నారు. వారం, పది రోజుల క్రితం కోతలు కోసి ధాన్యం ఆరబెట్టుకున్నామని, సంచుల కోసం రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే) చుట్టూ తిరిగినా ఫలితం లేదని పలు గ్రామాల్లో రైతులు తెలిపారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించలేక రోడ్ల పక్కన, కళ్లాల్లోనూ రాశులు పోసి నిల్వ ఉంచామంటున్నారు.

మరలా ఆరబెట్టాల్సిందే..

జిల్లావ్యాప్తంగా ఆదివారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయి మరలా ఆరబెట్టేందుకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. సకాలంలో సంచులు అందజేసి ఉంటే ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదంటున్నారు. మరోపక్క వస్తున్న సంచుల్లో చీకిపోయినవి, చిరిగిపోయిన ఉంటున్నాయనే విమర్శలున్నాయి. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరమైన ఆచంట, తణుకు, పాలకొల్లు తదితర నియోజకవర్గాల్లో చాలా చోట్ల ఇటువంటి పరిస్థితి ఉందంటున్నారు. కొరత లేకుండా నాణ్యమైన సంచులను అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆలస్యంగా ఇచ్చారు



మూడు ఎకరాలు కౌలు సాగు చేశాను. పంట కోసి ధాన్యం ఆరబెట్టుకున్నా సకాలంలో సంచులు ఇవ్వలేదు. సంచులు వచ్చాక పట్టుబడి చేశాం. మిల్లుకు తరలిద్దామనుకునే లోపు అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయింది. ఇబ్బంది పడ్డాం.

– సి.సుందరరావు, కౌలురైతు, ఇలపర్రు

సంచులు లేకే సమస్య



మూడు ఎకరాల్లో కౌలు సాగు చేశాను. వారం క్రితమే కోసి ధాన్యం ఆరబెట్టుకున్నాను. సంచుల కోసం సచివాలయానికి వెళితే లేవన్నారు. సంచులుంటే ఈపాటికే ధాన్యాన్ని మిల్లుకు తరలించుకునే వాణ్ణి. నిన్న కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో మరలా ఆరబెట్టాల్సి వస్తోంది.

– డి. శ్రీను, కౌలు రైతు, ఆలమూరు

వర్షానికి తడిసిపోయింది



వరి కోతలు పూర్తయిన తర్వాత ధాన్యాన్ని మిల్లులకు తోలడానికి సంచుల కోసం ఎదురు చూస్తున్నాను. సంచులు ఇదిగో వస్తాయి అదిగో వస్తాయంటూ అధికారులు కాలయాపన చేశారు. వర్షానికి ధాన్యం పంట తడిసిపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– కుడిపూడి నాగ సత్యనారాయణ, రైతు, ఇరగవరం

అవస్థలు పడుతున్నాం



సుమారు 90 బస్తాల వరకూ ధాన్యం పండింది. అడిగిన వెంటనే అధికారులు గోనె సంచులు ఇచ్చి ఉంటే బాగుండేది. నాలుగు రోజులు గడిచినా గోనె సంచులు ఇవ్వలేదు. దీంతో ధాన్యం పంటను వర్షాల నుంచి కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

– ఆలం సత్యనారాయణ, రైతు, తణుకు

ఏపీఈ సెట్‌కు సర్వం సిద్ధం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఏపీ ఈసెట్ పరీక్ష మంగళవారం నిర్వహించనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని 10 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్ష జరగనుంది. ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ స్కూల్‌లో ఉదయం 180 మంది, మధ్యాహ్నం 141 మంది, సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 148 మంది, మధ్యాహ్నం 100 మంది, ఏలూరు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉదయం 100 మంది హాజరు కానున్నారు. భీమవరం డీఎన్నార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉదయం 110 మంది, మధ్యాహ్నం 100 మంది, దంతులూరి నారాయణరాజు అటానమస్ కళాశాలలో ఉదయం 100 మంది మధ్యాహ్నం 100 మంది, విష్ణు కళాశాలలో ఉదయం 100 మంది, మధ్యాహ్నం 93 మంది హాజరు కానున్నారు. శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కాలేజీ ఆఫ్ ఉమెన్స్‌లో ఉదయం 100 మంది, నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉదయం 150 మంది, మధ్యాహ్నం 98 మంది, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 230 మంది, మధ్యాహ్నం 150 మంది, శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్‌లో ఉదయం 225 మంది మధ్యాహ్నం 120 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

రోడ్ల అభివృద్ధికి నాబార్డు నిధులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ.13.40 కోట్ల నాబార్డు నిధులు మంజూరైనట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. జిల్లాలో 37.020 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యారన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ నాగరాణి చెప్పారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం భీమవరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మొత్తం 8 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ వి.భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోడూరులో అత్యధిక వర్షపాతం

భీమవరం: జిల్లాలో ఆదివారం పోడూరులో అత్యధికంగా 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పాలకోడేరులో 9.6 మి.మీ వర్షం కురిసింది. సోమవారం జిల్లా సమాచార శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. మండలాల వారీగా.. పాలకొల్లులో 73.4, తాడేపల్లిగూడెంలో 33.6, పెంటపాడులో 35, తణుకులో 16.6, అత్తిలిలో 31.6, గణపవరంలో 51.4, ఆకివీడులో 37.6, ఉండిలో 21.6, పెనుమంట్రలో 28.4 వర్షం పడింది. ఇరగవరంలో 34.8, పెనుగొండలో 26.8, ఆచంటలో 44 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వీరవాసరంలో 24.2, భీమవరంలో 31.4, కాళ్లలో 23.8, మొగల్తూరులో 33.8, నరసాపురంలో 30.2, యలమంచిలిలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెన్షన్ బిల్లుతో ఇబ్బందులు

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం మార్చిలో తీసుకువచ్చిన పెన్షన్ బిల్లు వల్ల పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బంది పడతారని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు వంగల గోవిందరావు అన్నారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గోవిందరావు డిమాండ్ చేశారు. సంఘ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఉపాధ్యక్షుడు ఈమని శేషయ్య, కార్యదర్శి సోమయాజులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, కోశాధికారి కేఎస్ఎస్ఆర్‌కే ప్రసాదరావు పాల్గొన్నారు.


కనీస వేతనాల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): కార్మికులకు కనీస వేతన సలహా బోర్డును వెంటనే నియమించాలని కనీస వేతనం నెలకు రూ.35 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన జరిగిన ధర్నాలో రామారావు మాట్లాడారు. కార్మిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగాన్ని పటిష్టం చేసి కనీస వేతన చట్టాల అమలుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, జిల్లా నాయకులు పి.కిశోర్ మాట్లాడారు.

అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలి



దళిత సేన ఆధ్వర్యంలో ధర్నా

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాలకు సాగు పట్టాలను మంజూరు చేయాలని, అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలని, అర్హులైన చర్మకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ దళిత సేన ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్ మాట్లాడారు. ముందుగా ఏలూరు ఓవర్‌బ్రిడ్జి పక్కనున్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. దళిత సేన నాయకులు కాకర్లమూడి వెంకటరావు, స్టాలిన్, చీలి మోహన రావు, మాణిక్యాలరావు, దిరుసు పాముల పుష్ప, బేతాళ జయసుధ పాల్గొన్నారు.

రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మాజీ మంత్రి కొట్టు



కొండేపాడులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రైతుల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, వర్షాలతో దెబ్బతిన్న రైతులను తక్షణం ఆదుకోవాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కొండేపాడు, మీనవిల్లూరు, రామచంద్రపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. వర్షంతో ధాన్యం తడిసి ఆరబెట్టుకున్న రైతులను పరామర్శించారు. మాసూళ్ల ఆఖరిలో గోనె సంచులు అందించకుండా ప్రభుత్వం తాత్సారం చేయడంతో ధాన్యం తడిసిపోయిందని, పొలాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తోలలేకపోయామని చెప్పుల ప్రసాద్, షరాబు తదితర రైతులు వాపోయారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించకుండా తాత్సారం చేస్తోందన్నారు. ప్రధానంగా గోనె సంచుల కొరత తీర్చాలన్నారు. మాసూళ్ల చివరిలో వచ్చిన వర్షం వల్ల రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా రైతులను ఆదుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇసుక, మద్యంతో టీడీపీ అక్రమ దోపిడీ చేస్తోందని ఆరోపించారు. దేశానికి అన్నం పెట్టే రైతులపై శ్రద్ధ చూపాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, బండారు నాగు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి, గూడూరి సూర్యనారాయణ, చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు చల్లా లింగమూర్తి, గోకా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసి అర్జీలు స్వీకరించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. మొత్తంగా 149 అర్జీలు స్వీకరించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

అర్జీల్లో కొన్ని..

- భీమవరం మండలం తుందుర్రుకి చెందిన చింతలపాటి సూర్యనారాయణరాజు తనకున్న 3.5 ఎకరాల రొయ్యల చెరువు ఆనుకుని పుంత రోడ్డు ఉందని, అయితే ఈ రోడ్డును గ్రామానికి చెందిన పొత్తూరి వెంకటరాజు అనే వ్యక్తి ఆక్రమించుకున్నారని, దీంతో నడక మార్గం లేక ఇబ్బంది పడుతున్నామంటూ అర్జీ అందించారు.
- వీరవాసరం మండలం రాయకుదురుకి చెందిన దుండి మంగమ్మ తనకు 52 సెంట్ల పొలం ఉందని సరిహద్దు రైతు పంట బోదె పూడ్చడంతో రెండు సెంట్లు కోల్పాయానని, తన భూమికి హద్దులు చూపించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

నీరు లేక.. పంట సాగు చేయలేక..



అత్తిలి మండలం కంచుమర్రుకి చెందిన రైతు మాండ్రుమాక జయ ప్రసాద్ వ్యవసాయ భూమికి సాగు నీరందించే పంటో బోదె పూడిపోయింది. చెత్తాచెదారం, డ్రెయినేజీ నీళ్ల బోదెలో వదలడంతో సాగుచేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఖరీఫ్, రబీ సీజన్లలో పంట విరామం ఇచ్చి నష్టపోయాయని, సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు అర్జీ అందించారు.

పాపకు పెన్షన్ పెంచాలని..



ఆచంట మండలం వల్లూరు చిల్లేవారి పేటకు చెందిన చిల్లే రాజు, మరియమ్మ దంపతుల కుమార్తె పుట్టుకతో దివ్యాంగురాలు. ప్రభుత్వం నుంచి నెలకు రూ.6 వేల పెన్షన్ వస్తుండగా మందుల ఖర్చు రూ.10 వేలు అవుతోంది. కూలీ పనులపై బతికే తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ పాపకు రూ.15 వేలు పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కలిసి అభ్యర్థించారు.

తాగునీరు లేక ఇబ్బందులు



భీమవరం 32వ వార్డు ప్రశాంతి నగర్‌లో తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ట్యాంకర్లతో కూడా నీరు సరఫరా చేయడం లేదంటూ స్థానికులు కలెక్టర్‌ను కలిసి అర్జీ అందించారు. భీమవరం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు పలుమార్లు సమస్య తెలియజేసినా పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకోవాలని కోరారు.

రజకుల చెరువును రక్షించండి



పాలకోడేరు మండలం వేండ్రలోని రజకుల చెరువు ఆక్రమణలకు గురైందని, రక్షించాలని రజక యువజన సంక్షేమ సంఘ సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కులవృత్తికి ఉపయోగించుకునే చెరువు అధ్వానంగా మారడం, చెరువు ఆక్రమణకు గురికావడం జరిగిందన్నారు. చెరువును సర్వే చేసి, చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలికల అదృశ్యం

3 గంటల్లోనే ఛేదించిన పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరులో ఇద్దరు బాలికలు అదృశ్యం కాగా పోలీసులు మూడు గంటల్లోనే కేసును ఛేదించి వారిని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలు స్నేహితులు. ఇటీవల వీరిద్దరూ పదో తరగతి పరీక్షలు రాశారు. కొద్దిరోజుల క్రితం వీరికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అప్పటినుంచి అతడితో బాలికలిద్దరూ సన్నిహితంగా చాటింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంటి నుంచి పరారయ్యారు. తల్లిదండ్రులు, బంధువులు గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో సాయంత్రం 5 గంటల సమయంలో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ అశోక్‌కుమార్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తప్పిపోయిన ఇద్దరు బాలికలను 3 గంటల వ్యవధిలో గుర్తించారు. బాలికలిద్దరినీ క్షేమంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే అగంతుకులతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాలికలకు సీఐ అశోక్ కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

సెంట్రల్ బ్యాంకులో రుణాల కుంభకోణం

నకిలీ అగ్రిమెంట్లతో రూ.4 కోట్లు గోల్‌మాల్



నరసాపురంలోని సెంట్రల్ బ్యాంకులో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నరసాపురం: పట్టణంలోని కోటిపల్లివారి వీధిలోని సెంట్రల్ బ్యాంకు బ్రాంచీలో భారీ రుణాల కుంభకోణం సోమవారం వెలుగుచూసింది. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వేములదీవిలో 19 ఎకరాల రొయ్యల చెరువుకు సంబంధించి నకిలీ లీజు అగ్రిమెంట్లు సృష్టించి బ్యాంకులో సుమారు రూ.4 కోట్లు రుణాలు తీసుకున్నారు. చెరువు అసలు యజమానులు రుణం కోసం వేరే బ్యాంకుకు వెళ్లగా ఈ చెరువులపై ఇప్పటికే రుణాలు తీసుకున్నట్టు తెలియడంతో కుంభకోణం బయటపడింది. దీంతో అసలు యజమానులు తిరుమాని నాగరాజు, శ్రీనివాసరావు సెంట్రల్ బ్యాంకుకు వచ్చి మేనేజర్ టి.ప్రకాశంను నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వచ్చి రాత్రి 9 గంటల వరకు బ్యాంకులో తనిఖీలు చేసి వివరాలు సేకరించారు.

కుంభకోణం జరిగిందిలా..

వేములదీవిలో తిరుమాని వడ్డికాసులు, పద్మ దంపతులకు 19 ఎకరాల రొయ్యల చెరువులు ఉన్నాయి. వడ్డికాసులు 2020లో మృతి చెందగా ఆయన ఇద్దరు కుమారులు నాగరాజు, శ్రీనివాసరావు ఆస్తి పంచుకున్నారు. ఇదిలా ఉండగా 2024లో పట్టణానికి చెందిన ప్రముఖుడు కూనపరెడ్డి ప్రసాద్, మరో వ్యక్తి దూడే చంద్రశేఖర్‌లు వడ్డికాసులు 19 ఎకరాల చెరువును తమకు లీజుకు ఇచ్చినట్టుగా నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి సెంట్రల్ బ్యాంకులో రుణం పొందారు. బ్యాంకు అధికారులు ప్రసాద్ పేరున రూ.2.36 కోట్లు, చంద్రశేఖర్ పేరున రూ.1.63 కోట్లు రుణాలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో వడ్డికాసులు కుమారుడు నాగరాజు మరో బ్యాంకులో రుణం నిమిత్తం సదరు చెరువుల డాక్యుమెంట్లు తీసుకువెళ్లగా మోసం బయటపడింది. దీంతో నాగరాజు, కొందరు గ్రామస్తులు సెంట్రల్ బ్యాంకుకు వెళ్లి మేనేజర్‌ను నిలదీశారు. తన తండ్రి 2020లో చనిపోతే 2024లో లీజు అగ్రిమెంట్ ఎలా రాశారని, రుణం ఎలా ఇచ్చారంటూ గొడవపడ్డాడు. బ్యాంకు వద్ద ఉద్రిక్తత ఏర్పడగా టౌన్ ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి సిబ్బందితో వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ముత్యాలరావు చెప్పారు.

చక్రం తిప్పిన బ్రోకర్!

రుణాల కుంభకోణంలో మాధవ్ అనే బ్రోకర్ చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారం బ్యాంకు అధికారుల పాత్రతోనే సాగినట్టుగా సమాచారం. భారీగా పర్సంటేజీలు చేతులు మారినట్టు తెలిసింది. సదరు బ్రోకర్ పట్టణంలోని మిగిలిన కొన్ని బ్యాంకుల్లో కూడా చాలా మందికి ఈ తరహా రుణాలు ఇప్పించినట్టు వార్తలు వస్తున్నాయి.

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి జిల్లాస్థాయి కమిటీ

ఏలూరు(మెట్రో): ఏలూరు స్పెషల్ కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ జీఓ మేరకు అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటుచేస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలు, జిల్లా రిజిస్ట్రార్, డీపీఆర్‌ఓ, జిల్లా ఐటీ అధికారి (డీఐఓ ఎన్ఐసీ), సీఐడీ అదనపు ఎస్పీ, నగరపాలక సంస్థ ఏఓ, ఏలూరు స్పెషల్ కోర్ట్ అగ్రిగోల్డ్ సంస్థ సూచించిన పేర్ల సీతారామస్వామి ఆథరైజ్డ్ మెంబర్‌గా జిల్లాస్థాయి కమిటీని నియమించారు. సీఐడీ అదనపు ఎస్పీ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఏలూరు అర్బన్, ద్వారకాతిరుమల తహసీల్దార్లు జిల్లాస్థాయి కమిటీకి విచారణలో సహకరించాలని సూచించారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఎక్కడ ఉన్నాయో పరిశీలించడం, సంబంధిత సబ్ రిజిస్ట్రార్ల నుంచి భూముల విలువ సేకరించడం, అధీకృత సంస్థల నుంచి సరసమైన మార్కెట్ ధర సేకరించడం, అగ్రిగోల్డ్ భూములు రెవెన్యూ రికార్డుల్లో మ్యూటేషన్ చేయడం జిల్లాస్థాయి కమిటీ విధులుగా నిర్దేశించారు.

నేడు రోడ్డు భద్రతా కమిటీ సమావేశం : ఏలూరు జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

మల్లఖాంబ్ జాతీయ పోటీలకు భీమవరం క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మల్లఖాంబ్ పోటీలకు భీమవరం పట్టణానికి చెందిన క్రీడాకారులు 9 మంది ఎంపికయ్యారని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జీపీసీ శేఖర్‌రాజు చెప్పారు. బీహార్ రాష్ట్రం బుద్ధగయలో జరిగే పోటీలకు రాష్ట్ర జట్టులో 12 మంది పాల్గొంటుండగా భీమవరం పట్టణానికి చెందిన పి.రోహిత్‌కుమార్, ఆర్.మనీషా, ఎ.భువనచంద్రిక, వైష్ణవి, బి.కీర్తి, జి.దివ్యజ్యోతి, ఎం.ఆదిత్యవెంకటదుర్గ, డి.ప్రసాద్, పి.గోపీకృష్ణ ఉన్నారని తెలిపారు. మల్లఖాంబ్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను శేఖర్‌రాజు, పీఈటీ ఎం.లక్ష్మి అభినంధించారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

భీమవరం: మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై రెహమాన్ తెలిపారు. పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌లో పి జ్యోతి తన ఇంటి వద్ద ఆదివారం రాత్రి బండి పార్కింగ్ చేయగా సోమవారం తెల్లవారేసరికి కన్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముద్దాడ



ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ముద్దాడ గణేష్ తదితరులు

పాలకొల్లు సెంట్రల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పాలకొల్లుకు చెందిన ముద్దాడ గణేష్ భవానీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ నియోజకవర్గ, డివిజన్, జిల్లాకు అధ్యక్షుడిగా, రాష్ట్ర పదవుల్లో ప్రధాన కార్యదర్శి, ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రచార కమిటీ చైర్మన్, వర్కింగ్ అధ్యక్షుడిగా పనిచేశానన్నారు. ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా సంఘం మరింత అభివృద్ధి చెందడానికి తనవంతు కృషి చేస్తానని గణేష్ భవానీ చెప్పారు. గణేష్ నియామకం పట్ల రాష్ట్ర బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- రేపటి నుంచి ద్వారకాతిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- 11న రాత్రి తిరుకల్యాణం, 12న రాత్రి రథోత్సవం
- రోజుకో ప్రత్యేక అలంకారంలో దర్శనమివ్వనున్న శ్రీవారు
- ఉత్సవాలు ముగిసే వరకు ఆర్జిత సేవలు రద్దు



ఉభయ దేవేరులతో శ్రీవారు



శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం

ద్వారకాతిరుమల: చిన్నతిరుమలేశునికి జరిగే బ్రహ్మోత్సవాలు ఇలలో ఓ అద్భుతం.. వర్ణనాతీతం. శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఈనెల 7 నుంచి 14 వరకు (8 రోజుల పాటు) ద్వారకాతిరుమల దేవస్థానం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ఈ ఉత్సవాలు శ్రీవారి వైభవాన్ని చాటనున్నాయి. క్షేత్రంలో ప్రతి ఏటా (రెండు సార్లు) వైశాఖ మాసంలో వెలసిన స్వామికి, ఆశ్వయుజ మాసంలో ప్రతిష్ఠ స్వామికి ఈ బ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమోక్తంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. వీటితో పాటు నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవాలను అట్టహాసంగా జరుపుతున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 7 నుంచి శ్రీవారి వైశాఖమాస బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించనున్నారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో స్వామివారు ఉభయ దేవేరులతో కలసి ఉదయం, సాయంత్రం వేళల్లో పలు వాహనాలపై తిరువీధుల్లో విహరించనున్నారు. అలాగే ఆలయ ముఖ మండపంలో రోజుకో విశేష అలంకారంలో శ్రీవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

ఉత్సవాలు జరిగేదిలా..


- ఈనెల 7న ఉదయం శ్రీవారిని పెండ్లికుమారునిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేసి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి గజ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 8న రాత్రి 7 గంటల నుంచి అంకురార్పణ, రుత్విగ్వరణ అనంతరం బ్రహ్మోత్సవాల వీక్షణకు సర్వాది దేవతలను ఆహ్వానించే క్రమంలో ధ్వజారోహణను నిర్వహిస్తారు. రాత్రి 9 గంటల నుంచి హంస వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 9న ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవాలు జరుగుతాయి.
- 10న ఉదయం 7 గంటల నుంచి హనుమద్వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 8.30 గంటల నుంచి వెండి శేష వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 11న రాత్రి 8 గంటల నుంచి శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం, అదే రోజు ఉదయం 7 గంటల నుంచి సింహ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 12న రాత్రి 8 గంటల నుంచి క్షేత్ర పురవీధుల్లో రథోత్సవం జరుగుతుంది.
- 13న ఉదయం 10.30 గంటల నుంచి చక్రవారి–అవభృథోత్సవము, మధ్యాహ్నం 3 గంటల నుంచి వేద సభ, రాత్రి 8 గంటల నుంచి పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ, రాత్రి 9 గంటల నుంచి అశ్వ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 14న ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవ వేడుకలు జరుగుతాయి. అలాగే రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగము – పవళింపు సేవ కార్యక్రమాలతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి.

దాదాపుగా పూర్తయిన ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు సమయం దగ్గర పడటంతో స్వామివారి వాహనాలను సిబ్బంది ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు నిర్మించారు. అలాగే ఆలయ రాజగోపురాలు, పరిసరాలకు విద్యుద్దీప అలంకారాలు చేశారు. దాంతో ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన పనులు దాదాపుగా పూర్తయ్యాయి.

ప్రత్యేక అలంకారాలు ఇలా..
ఈనెల 7న శ్రీ మహావిష్ణువు
8న మత్స్యావతారం
9న శ్రీరామ
10న మురళీకృష్ణ
11న మోహిని
12న రాజమన్నార్
13న కాళీయమర్ధనం
14న శయన మహావిష్ణువు

భక్తులు తరలిరావాలి



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాల్లో పాల్గొనే సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తాం. 8 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 7 నుంచి 14 వరకు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నాం. భక్తులు గమనించాలి.

– ఎస్‌వీ సత్యన్నారాయణ మూర్తి, శ్రీవారి దేవస్థానం ఈఓ

నిప్పులగుండం తొక్కిన భక్తులు

నరసాపురం రూరల్: పసలదీవి గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం నిప్పుల గుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మహిళలు, యువకులు నిప్పులపై నడిచి అమ్మవారిపై ఉన్న భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

దగ్గులూరులో చోరీ

పాలకొల్లు సెంట్రల్: దగ్గులూరు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జలగం సత్యనారాయణ తన కుటుంబంతో గత నెల 14న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. బీరువాలో ఉన్న రూ.60 వేలు విలువ చేసే బంగారు, వెండి వస్తువులు పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు.

కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాల సీజ్

భీమడోలు: కోడి వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై వై.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం భీమడోలు పంచాయతీ శివారు లింగంపాడు ఏరియాలోని చేపల చెర్వులకు కోడి వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను సోమవారం భీమడోలు పోలీసులు పట్టుకున్నారు. సుమారు 15 టన్నుల కోడి వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల నిరసన



భీమవరం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌వోల నిరసన

భీమవరం (ప్రకాశం చౌక్): విలేజ్ క్లినిక్‌ల సీహెచ్‌ఓల నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. గత 8 రోజులుగా వారు తమ సమస్యలపై నిరసన గళం వినిపిస్తున్నారు. భీమవరం కలెక్టరేట్ వద్ద టెంట్ వేసుకుని ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉద్యోగ భద్రత, న్యాయమైన డిమాండ్లపై పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే వారు రోజుల తరబడి నిరసన కార్యక్రమంలో ఉండడం వల్ల గ్రామాల్లో స్థానిక వైద్య సేవలు నిలిచిపోయాయి. పెనుమంట్ర మండలం పాలమూరు గ్రామం విలేజ్ క్లినిక్‌లో ఒక ఆర్ఎంపీ డాక్టర్ వెళ్లి వైద్య సేవలు అందించినట్లు సీహెచ్‌ఓల యూనియన్ నాయకులు మీడియా దృష్టికి తీసుకువచ్చారు. అతడు వైద్యం చేస్తున్న ఫొటోలు సేకరించి, వారు లేని విలేజ్ క్లినిక్‌లలో పరిస్థితి ఏ విధంగా ఉందో మీడియాకు తెలియజేశారు. అలాగే పలు చోట్లు ఆరోగ్య మిత్రలు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వైద్యా ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శిస్తున్నారు.

కుసుమ ధర్మన్న సాహిత్యం నేటి తరానికి ఆదర్శం



సంచికను ఆవిష్కరిస్తున్న కవులు, సాహితీవేత్తలు

పాలకొల్లు సెంట్రల్: జాతీయ ఉద్యమకారుడు, 19వ శతాబ్దపు తొలితరం దళిత కవి కుసుమ ధర్మన్న ఉద్యమ సమరంతో పాటు సామాజిక సేవలో ఎంతో విశిష్టత సాధించారని, ఆయన సాహిత్యం నేటితరానికి ఆదర్శనీయమని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లెల్ల సత్య సుధామ (సామాజిక సేవా), ఉన్నమాటి శ్యాం సుందర్ (కార్టూన్ జర్నలిజం), డాక్టర్ పెంకి విజయ్ కుమార్, వాసంశెట్టి దుర్గా శంకర్ (కళారంగం), మామిడిశెట్టి శ్రీనివాస్ (తెలుగు సాహిత్యం) లకు కుసుమ ధర్మన్న ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కవులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. బత్తుల మురళీకృష్ణ రచించిన జముకు, దీర్ఘ కవితను, తంగిరాల సోనీ సంపాదకత్వంలో వెలువడిన ప్రజాకాంక్ష ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. కుసుమ ధర్మన్న సాహిత్య వేదిక రాష్ట్ర నూతన అధ్యక్షునిగా కోలాటి చిన పెద్దిరాజు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో నేలపూరి రత్నాజీ, పేరూరి మురళీకుమార్, గొల్లపల్లి అంబేద్కర్, డా అలుగు ఆనంద్, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌లు దేశాభివృద్ధికి అవసరం



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న దృశ్యం

నూజివీడు: విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విద్యపై నిర్వహిస్తున్న ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఎంతో దోహదపడుతుందని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో ఆర్జీయూకేటీ, వాధ్వానీ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు ట్రిపుల్ ఐటీల నుంచి ఎంపిక చేసిన 49 మంది అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దే బదులుగా వారినే వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దినట్లయితే దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి విద్యార్థి స్టార్టప్ ప్రారంభించేలా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన నవీన్ అహ్మద్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు విద్యార్థుల్లా నేర్చుకొని తరువాత విద్యార్థులకు శిక్షణనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఈఐపీటీ పీ శ్యామ్, ఏఓ బీ లక్ష్మణరావు, సుజాత, ఫైనాన్స్ ఆఫీసర్లు నాగార్జునాదేవి, శ్రీనాథ్ డీన్ అకడమిక్స్ చిరంజీవి, డీన్ ఎవాల్యూషన్ రియాజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబం ఆమరణ నిరాహార దీక్ష



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన దళిత కుటుంబం

బుట్టాయగూడెం: తమకు న్యాయం చేయాలని కోరుతూ ఓ దళిత కుటుంబం సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆ కుటుంబానికి చెందిన బాషా శ్యామ్‌బాబు, బాషా రాజేష్ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం మర్రిగూడెం సమీపంలో సర్వే నంబర్ 415లో 10–58 సెంట్లు, సర్వే నంబర్ 415లో 4 ఎకరాల 28 సెంట్లు, సర్వే నంబర్ 417/1లో 8–50 సెంట్లు మొత్తం 23 ఎకరాల 36 సెంట్ల భూములు తమ తాతల కాలం నాటివని అన్నారు. 2002, 2006 సంవత్సరాల్లో బుట్టాయగూడెం రెవెన్యూ అధికారులు పంచనామా చేసి ఆ భూములను తమకు అప్పగించారని, అప్పటి నుంచి ఆ భూముల్లో తామే సాగు చేసుకుని జీవిస్తున్నామని తెలిపారు. అయితే ఈ భూముల్లో కొందరు ప్రవేశించి తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆ భూముల్లో ఉన్న జీడిమామిడి, మామిడి పంటలను దౌర్జన్యంగా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేసే వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షలో వెంకాయమ్మ, వేములూరి నాగేంద్ర, వేములూరి వెంకటలక్ష్మి, వేములూరి ముకుంద, బాషా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గూడెం'లో 33.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 33.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. తహసీల్దార్ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వక్తలు మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలని, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, విద్యా హక్కు చట్టం మేరకు మాతృభాషను కొనసాగించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ప్రాథమిక విద్య ఎప్పటి లాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ, జిల్లా నాయకులు పుష్పరాజ్, మండల నాయకులు ఎస్.శ్రీనివాస్, టౌన్ నాయకులు కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తణుకు తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఎస్‌ఎంయూపీ నాయకులు

తణుకు అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఎంయూపీ ఆధ్వర్యంలో నాయకులు తణుకు తహసీల్దార్ దండు అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంయూపీ డిపో అధ్యక్షుడు సరిదే ఏసుబాబు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సౌకర్యార్థం 1/2019 సర్కులర్‌ను తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులకు భద్రత కలుగజేయాలని అన్నారు. నైట్ అవుట్ విధులకు రూ. 400 అలవెన్స్‌లు ఇవ్వాలని, ఇహెచ్‌ఎస్ పద్ధతిలోనే పాత విధానాన్ని పునరుద్ధరించాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే తీయాలని డిపోలోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తణుకు డిపో కార్యదర్శి బయ్యే సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి తలారి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

భగీరథుని స్ఫూర్తితో ముందుకెళ్లాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భగీరథుని స్ఫూర్తితో ముందుకెళ్లాలని సగర సంఘం నాయకులు, సగర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య పేర్కొన్నారు. భగీరథ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక కార్యాలయంలో భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సగరలు ఎదుర్కొంటున్న ఆయా సమస్యల పరిష్కారానికి సగరలు కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. నాయకులు ఏపూరి సత్యనారాయణ, గుళ్ళపల్లి కొండలరావు, టి.కోటేశ్వరరావు, కె.పూలరెడ్డి, జలసూత్రం వెంకటేశ్వరరావు, యడవల్లి పండు, గుర్రం సుబ్బారావు, కొండరాజు పాల్గొన్నారు.

ఘనంగా మార్క్స్ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదల పాలిట పెన్నిధి కార్ల మార్క్స్ 207వ జయంతిని పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి ఉల్లిపాయల మార్కెట్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చల్లా చంద్రరావు అధ్యక్షత వహించారు. మార్క్స్ చిత్రపటానికి సీఐటీయూ, సీపీఎం నాయకులు సిరపరపు రంగారావు, బొంకూరు నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. మార్క్స్ జీవిత విశేషాలను కార్మికులకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అల్లు సుబ్బారావు, కరక వెంకట్రావు, కె.అప్పారావు, అల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో సోమ వారం కమ్యూనిస్టు ఉద్యమ పితామహులు పీడిత ప్రజల విముక్తి ప్రధాత కార్ల మార్క్స్ 207వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో సీపీఐ మండల అధ్యక్షుడు నామన వేంకటేశ్వర్లు, అడ్డాల సత్యనారాయణ, చుక్కల బ్రహ్మయ్య, గాలింకి వేంకటేశ్వర్లు గిద్దా సూర్యనారాయణ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. 11వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సికిందర్ బాషా ప్రారంభించారు. కోర్టు కు హాజరైన కక్షిదారులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, గుమాస్తాలు తదితరులకు మజ్జిగను అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, 1వ అదనపు సివిల్ జడ్జి లలితాదేవి, అసోసియేషన్ ప్రెసిడెంట్ శిరిగినీడి విజయకృష్ణ, పాల్గొన్నారు.

కళతప్పిన పంట కాలువలు

- నిర్వహణ లేమి
- రైతుల ఇక్కట్లు పట్టని కూటమి ప్రభుత్వం



మిడ్‌లెవెల్ కాలువలో అలంపురం వద్ద తూడుతో నిండిన కర్రనాచు



ప్రత్తిపాడు, రాచర్ల గ్రామాల వద్ద పంట కాలువలో పేరుకొన్న చెత్తా, చెదారాలు

పెంటపాడు: ఒకప్పుడు గ్రామాల్లో ప్రజలకు తాగు నీరు, సాగునీటికి ఉపయోగపడిన కాలువలు ఇప్పుడు నిర్వహణ లేమితో వెలవెలబోతున్నాయి. కాలువలలో కాలుష్యాలు పేరుకుపోతున్నాయి. ఈ వేసవిలో పంట కాలువలు శుభ్రం చేసుకోక పోతే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆధునీకరణ లోపం రైతులకు శాపంలా పరిణమించింది. కూటమి ప్రభుత్వం రైతులపై కక్ష కట్టింది. ఈ దాళ్వా ఎదోలా గట్టెక్కినా రాబోయే సార్వాలో వేల ఎకరాలు పంట ముంపునకు పూడికతీత లేకపోవడమే ప్రధానకారణమవుతోంది. ప్రధానంగా పెంటపాడు మండలంలోని అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, రావిపాడు, వల్లూరుపల్లి, బోడపాడు, దర్శిపర్రు, జట్లపాలెం, పెంటపాడు, కె. పెంటపాడు, విప్పర్రుతోపాటు, తణుకు ప్రాంతంలోని కోనాల, గూడెం మండలంలోని కృష్ణాయపాలెం, ఉంగుటూరు మండలంలోని బొమ్మిడి, బాదంపూడి ప్రాంతాల మీదుగా ప్రధాన పంట కాలువలైన మిడ్‌లెవెల్, లోలెవెల్ కాలువలు ప్రవహిస్తున్నాయి. అయితే ఈ రెండు కాలువల ద్వారా వేలాది ఎకరాలు పంట సాగవుతున్నాయి. ఎన్నో గ్రామాలకు తాగునీరు అందుతోంది. అయితే ఇటీవల ఈ కాలువలు కాలుష్య కాసారాలుగా ఉన్నాయి. సమీప గ్రామాలలో చెత్త కాలువలలో వేస్తున్నారు. జంతు కళేబారాలు, ఈ కాలువలలో కొట్టుకొని వస్తున్నాయి. కాలువల సమీప గ్రామాలలో డ్రెయినేజీలు, సెప్టిక్ ట్యాంకుల మురుగు నేరుగా ఈ కాలువలో కలుపుతున్నారు. ప్రధానంగా మిడ్‌లెవెల్ సమీప గ్రామాలైన అలంపురం, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రులో లెవెల్ కాలువ సమీప గ్రామాలైన కె. పెంటపాడు గ్రామాలలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఇటీవల ఎమ్మెల్యే బొలిశెట్టి ఈ విషయంపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంట కాలువలు కాలుష్యం బారిన పడితే సహించేది లేదని తెల్చిచెప్పారు. కింది గ్రామాలలో తాగునీరు కలుషితం అవుతుందని, ఆ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడతారని అధికారులు చర్యలు తీసుకోవాలని, వీలైతే కేసులు నమోదు చేయాలని సూచించారు. అయితే ఈ వేసవిలో డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖల అధికారులు విస్తృతంగా తనిఖీలు చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఆ కాలువల్లో కిలోమీటర్ల మేర గుర్రపుడెక్క, కర్రనాచు, తూడు పేరుకుపోయింది. దాళ్వా సమయంలో ఈ సమస్య ఉన్నా వంతుల వారీ విధానం, రైతులు స్వచ్ఛందంగా కాలువలు బాగుచేత కారణంగా నీటి ఎద్దడి లేకుండా ఎదోలా గట్టెక్కారు. అయితే రాబోయే సార్వా విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముంపు సమస్య ఏర్పడకుండా పంట కాలువలు, డ్రెయినేజీలు పూడిక తీత తీయాల్సి ఉంది. ఈ విషయంపై సాగునీటి సంఘాల యజమానులు సమావేశాలు నిర్వహించుకొని ఉపాధి, డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖల అధికారుల సమన్వయంతో పూడిక తీత తీయించుకొంటే రాబోయే ముప్పునుండి గట్టెక్కే అవకాశం ఉంది. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పక్షులకు వేసవి విడిది కేంద్రాల ఏర్పాటు



అత్తిలి ఆశ్రమశాఖలో పీఠం సభ్యులు ఏర్పాటు చేసిన పక్షుల వేసవి విడిది కేంద్రం

అత్తిలి: ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడంతో పాటు మూగజీవాలైన పశుపక్షాదులకు ఆహారం, నీరు అందించే విధంగా పక్షుల వేసవి విడిది కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పీఠం సభ్యులు వల్లూరి రామకృష్ణ అన్నారు. సోమవారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం, అత్తిలి, బల్లిపాడు గ్రామాలలో గల శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమ శాఖలలో పక్షుల వేసవి విడిది కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా పీఠం సభ్యులు కర్రెడ్డి షాబాబు, ఆకుల రాంబాబు, యర్రంశెట్టి శివన్నారాయణ మాట్లాడుతూ శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ ఆలీషా సద్గురువర్యుల సూచనల మేరకు ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా పక్షుల వేసవి విడిది కేంద్రాలను ఆశ్రమ శాఖలలో ఏర్పాటు చేశామన్నారు. వేసవి విడిది కేంద్రాలకు అవసరమైన సామగ్రిని పీఠం సభ్యులు దంగేటి రామకృష్ణ, ఉషశ్రీ దంపతులు సమకూర్చారని చెప్పారు. వేసవిలో మూగజీవాలైన పశుపక్షాదులకు ఆహారం దొరకక ఇబ్బంది పడుతున్నాయని, వాటికి ఆహారం, నీరు అందించే విధంగా ఉమర్ ఆలీషా సూచనల మేరకు పక్షుల వేసవి విడిది కేంద్రాలను ప్రతి ఆశ్రమంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అత్తిలి మండలంలో పాటు ఉండ్రాజవరం, రేలంగి, పైడిపర్రు ఆశ్రమ శాఖలలో కూడా వీటిని నెలకొల్పామని చెప్పారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు దాసం గోపి, మేనేడి నరశింహారావు, దంగేటి రామకృష్ణ, దిరిశాల వాయుసుధాకర్, టి రవికుమార్, బొండపల్లి శ్రీనివాస్, సత్యంశెట్టి ఆంజనేయులు, ఆశ్రమశాఖల కన్వీనర్లు పాల్గొన్నారు.

పాఠశాలల వర్గీకరణ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

తణుకు అర్బన్: విద్యాశాఖలో ప్రభుత్వం అమలు చేయబోతున్న పాఠశాలల వర్గీకరణ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎస్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం అసంబద్ధ వర్గీకరణ విధానాన్ని విరమించి, పాఠశాలలను పరిరక్షించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు డీఏ పెండింగ్‌ను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. 12వ పీఆర్సీ ప్రకటించాలని, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.రామమోహన్, ఉపాధ్యక్షుడు కె.రాంబాబు, పి.జనార్ధనస్వామి, సీహెచ్‌వీ సత్యనారాయణ, కె.అంజిబాబు, బి.సుబ్బారావు, పి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35వేలు అమలు చేయాలి



మునిసిపల్ కార్యాలయం వద్ద భారీ ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనం రూ.35వేలు నిర్ణయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. కనీస వేతనం పెంపుదల డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంవద్ద, ఏరియా ఆసుపత్రి వద్ద కార్మికులచే భారీ ధర్నా నిర్వహించారు. కొత్త పీఆర్సీ ప్రకటించాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సంఖ్యను పెంచాలని కార్మికులు నినాదాలు చేశారు. డి.సోమసుందర్ మాట్లాడుతూ దేశంలో పెరిగిన జీవన వ్యయంతో పాటు కుటుంబ సభ్యుల సంఖ్య, ఆహార అవసరాలు, ఆహారేతర అవసరాలు, వినియోగ వస్తువులు, నిత్యావసర వస్తువులు, విద్య, ఆరోగ్యం, వినోదం వంటి అన్ని రకాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కనీస వేతనంను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సంపద సృష్టిలో సేవలలో కార్మికులు కీలక భూమికను పోషిస్తున్నారని, వారికి గౌరవ ప్రదమైన వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వంతో పాటు, ప్రైవేట్ యాజమాన్యాలు కూడా చట్టబద్ధ వేతనాలు ఇచ్చేటట్లు చూడాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు ఓసూరి వీర్రాజు, లక్ష్మీనారాయణ, తాడికొండ శ్రీనివాసరావులు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయకపోతే దశలవారి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: వేసవిలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఆరోగ్య విషయంలో వైద్యుల సలహాలను పాటించాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సదుపాయాలు, రక్తపరీక్షలు వంటివి ఉచితంగా అందుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునిసిపల్ ఇంజనీర్ వెంకటరమణ, మేనేజర్ రవి సుధాకర్, ఏఎస్ఓ సురేష్ ,వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పది వినతులు స్వీకరణ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పలు సమస్యలపై పది వినతులు వచ్చాయి.పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి రెండు, ఇంజనీరింగ్ విభాగానికి గాను మూడు, పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి రెండు, రెవెన్యూ విభాగంలో ఒకటి, పింఛన్ కోసం ఒక ఫిర్యాదు వచ్చింది.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

అత్తిలి: ఉపాధి కూలీల కడుపు కొట్టి కాంట్రాక్టుల జేబులు నింపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరరావు అన్నారు. అత్తిల మండలం బల్లిపాడు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను సోమవారం వారు కలిశారు. దోపిడిలేని సమాజం కోసం మార్గం చూపిన కమ్యూనిస్టు యోధుడు కారల్ మార్క్స్ 207వ జయంతిని ఉపాధికూలీల సమక్షంలో జరిపారు. ఈసందర్భంగా గోపాలన్, చినవీరభద్రరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారం చేపట్టిన అనంతరం కూలీల జాబ్‌కార్డుల సంఖ్యకు తగ్గట్టుగా గత మూడేళ్లుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంలేదన్నారు. పని ప్రదేశంలో చనిపోయిన ప్రతి కూలీకి రూ.10 లక్షల పరిహారం అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తానికొండ సుష్మ, జోషిబాయ్, తానికొండ ప్రవీణ్‌కుమార్, పద్దాలు, శేషారావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలకు స్పందన



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు పుస్తక పఠనంతో మేధాశక్తిని పెంచుకోవచ్చని రిసోర్స్‌పర్సన్ జి.బాపయ్య శర్మ తెలిపారు. పట్టణంలోని గ్రేడ్-1 వేసవి శిక్షణా శిబిరంలో సోమవారం ఎనిమిదోవ రోజు కొనసాగింది. డొక్క సీతమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బాపయ్యశర్మ మాట్లాడుతూ డొక్క సీతమ్మ జీవితం ఆదర్శనీయమని, నేటి విద్యార్థులు ఆమె జీవిత విశేషాలను తప్పక తెలుసుకోవాలని, ఆచరించాలన్నారు. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే వివిధ ఆటలను ఆడించారు. నేర్పించారు. కోపల్లె శ్రీనివాస్‌చే కథల పుస్తకాలను చదివించారు. వి.జనార్ధనరావుచే వేమన పద్యాలు అవగాహన చేశారు.గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష జరిపారు. యోగాపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశనుంచే యోగా సాధన చేయడం ద్వారా విద్యార్థులలో ఆత్మస్థైర్యం, మేధాశక్తి పెంపొందుతుందని రిటైర్డు టీచర్ గాబ్రియేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, డి సత్యకృష్ణ, కె శ్రీనివాస్, వై ప్రసాద్, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

దోమకాటు నివారణకు పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

తణుకు అర్బన్: దోమకాటు నివారణకు ఇంటి పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సజ్జాపురం కో యాక్సిల్ రోడ్డు ప్రాంతంలో సోమవారం మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, ఔట్ డోర్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్‌ను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు తమ ఇళ్లలో కొద్దిపాటి సమయాన్ని కేటాయించి చిన్న చిన్న నీటి నిల్వలు లేకుండా డ్రైగా ఉండేట్లు చూసుకోవాలని, నీటిని నిల్వ పెట్టుకునే పాత్రలపై విధిగా మూతలు ఉంచాలని సూచించారు. ముఖ్యంగా స్తబ్ధత కూడిన నీటి నిల్వలు దోమల పుట్టుకకు ఆవాసాలని, డ్రెయిన్‌లలో చెత్త వేయవద్దని మురుగు నీటి పారుదలకు ఆటంకం కలిగించవద్దని కోరారు. అనంతరం స్థానికంగా గుర్తించిన మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్‌ను వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ లో అప్లోడ్ చేయించారు. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీ బి.వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్ వై.మహాలక్ష్మి, ఆశా కార్యకర్త కేఎన్‌కే మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయ విజ్ఞాన సదస్సు



తణుకులో న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.కృష్ణ సత్యలత

తణుకు అర్బన్: ఆటో డ్రైవింగ్ వృత్తిలో ఉన్న కార్మికులంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత సూచించారు. లేబరు డే వారోత్సవాల్లో భాగంగా తణుకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని భారత మాత ఆటో యూనియన్ స్టాండ్‌లో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో ప్రయాణికులను నిబంధనలకు విరుద్ధంగా ఎక్కించుకోరాదని, ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని కోరారు. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాల్సిన డ్రైవర్లు మంచి అలవాట్లను కలిగి ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనాన్ని నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడితే ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడి ఉపాధి పొందుతున్నారని స్పష్టం చేశారు. తమ వృత్తిపరంగా రవాణా శాఖ ఉత్తర్వులను పాటిస్తూ వాహనానికి నిర్ణీత సమయానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు ఫోర్స్‌లో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఎం.కిరణ్ కుమార్, బి.లక్ష్మణ్ కుమార్, సీడీపీవో ప్రమోదిని కుమారి, పారా లీగల్ వలంటీర్లు కె. నాగ మల్లీశ్వరి, ఎం. శ్రీదేవి, కొనపల్లి అరుణ్ బాబు, కె. నరసన్న, భారతమాత ఆటో యూనియన్ అధ్యక్షుడు పంగం రాంబాబు, కార్యదర్శి కంచుమర్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం

ఆందోళనలో రైతులు



ఇరగవరంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



కొత్తపాడులో ధాన్యాన్ని బస్తాల్లో పడుతున్న దృశ్యం


ఇరగవరం: వరి కోతలు చివరి దశకు చేరుకున్నాయి. ధాన్యం రోడ్లు, కళ్లాలో ఉంది. ఇటువంటి తరుణంలో కురుస్తున్న వర్షాలు వరి రైతులకు వణుకు పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా ఆదివారం పలు ప్రాంతాల్లో ఏకదాటిగా కురిసిన వర్షంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో చేతికందిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు నానా పాట్లూ పడుతున్నారు. ఇరగవరం మండలలోని ఇరగవరం, కాకిలేరు, కె ఇల్లిందలపర్రు, రేలంగి, తూర్పు విప్పర్రు, గోటేరు, కంతేరు, కత్తవపాడు, కొత్తపాడు, కావలిపురం, పేకేరు, ఏలేటిపాడు, అయినపర్రు ఓగిడి, రాపాక, గ్రామాల్లోని రైతులు తడిచిన ధాన్యం ఆరబెడుతున్నారు. రైతులకు ఇప్పటికే ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. కూటమి ప్రభుత్వమే రైతులను నిండా ముంచిందని ఇరగవరం మండలంలోని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ మండలంలో 21 గ్రామాల్లో 13,501 ఎకారల్లో వరి సాగు చేస్తుండగా అన్ని ఎకరాల్లో కుడా వరి కోతలు పూర్తయ్యాయి. దీంతో సుమారు 13వేల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చింది. దీని కోసం సుమారు 10 లక్షలు పై చిలులకు గొనె సంచులు కావాలి అయితే నాయకులు, అధికారులు అలసత్వం వల్ల పూర్తి స్థాయిలో సంచులు అందుబాటులోకి రాలేదు. అందిన సంచులు అప్పుడప్పుడు కొన్ని సంచులుగా రైతులకు అందించడం జరిగింది. దీంతో రైతు కోతలు పూర్తి చేసినప్పటికి సంచులు లేకపోవడంతో రైతులు చేసేది లేక ధాన్యం కల్లాల్లో రాసులుగా పోసి ఉంచారు. ఆదివారం కురిసిన వానకు రాసులుగా పోసిన ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

సంచులు ఇవ్వలేదు

మాది ఇరగవరం మండలం. ఇరగవరం గ్రామంలో 3ఎకరాలో ధాన్యాన్ని ఒడ్డికి చేర్చుకుని పూర్తి తేమశాతం ఉన్నా ధాన్యాన్ని మిల్లులకు పంపించడానికి సిద్ధపడి అనేక సార్లు అధికారులు దగ్గరకు సంచులు కోసం వెళ్లడం జరిగింది. అయితే అధికారులు సంచులు ఇవ్వలేదు సంచులు రావాలి అని చెప్పడం జరిగింది. సంచులు కోసం ఎదురు చూస్తున్నా సమయంలో వర్షం రావడంతో ధాన్యం పూర్తిగా తడిచి పోయింది. ఇప్పుడు ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పతివాడ శ్రీను, ఇరగవరం రైతు

ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి



మండలంలో ఇప్పటి వరకు 9లక్షల 72వేల సంచులను రైతులకు అందజేయడం జరిగింది. మరొక 50వేలు పై చిలుకు సంచులు రావాలి. అవి వచ్చిన వేంటనే రైతులకు పూర్తి స్థాయి సంచులు అందిస్తాం. ఈ లోపు రైతులు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ 17 శాతం ఉన్నా తరువాత మిల్లులకు తరలించాలి. ఒకవేళ పై ధాన్యం తవడపోతే దానిని సంచుల్లోకి ఎత్తి మిల్లులకు తరలించి తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టాలి.

– వై.రాఘవేంద్ర, మండల వ్యవసాయ అధికారి, ఇరగవరం

బడిబాటను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యను పొందాలని మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు ముప్పిడి సరోజని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో మండల విద్యాధికారులు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌ల సూచనల మేరకు సోమవారం ఆమె కోరిమిల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను వివరించారు.